

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న టీటీసీ అభ్యర్థులు

రోడ్డెక్కిన టీటీసీ అభ్యర్థులు

వసతుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అభ్యర్థులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 10: టీచర్స్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సులో భాగంగా తమకు అటెండెన్స్ తక్కువగా ఉందని పరీక్షలకు అనుమతి ఇవ్వడం లేదని అదేవిధంగా వసతుల పేరుతో తమ వద్ద కోర్సు డైరెక్టర్లు డబ్బులు వసూలు చేశారని ఆరోపిస్తూ టీటీసీ అభ్యర్థులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే తమకు హాజరుశాతంలో కొంత మినహాయింపు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 90శాతం వరకు అటెండెన్స్ ఉన్న వారికి కొంత సడలింపు ఇస్తూ 100శాతం అటెండెన్స్ కల్పించి తదుపరి పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని కోరారు. హాజరుశాతం తక్కువ ఉన్న వారికి డెమోక్లాసులకు అనుమతి ఇవ్వాలని కోరారు.

అటెండెన్స్ పేరుతో డబ్బుల వసూళ్లు..

గతంతో పోలిస్తే ఈ సంవత్సరం టీటీసీ కోర్సుకు వంద శాతం అటెండెన్స్ ఉంటేనే తదుపరి పరీక్షలకు అనుమతిస్తామని విద్యాశాఖ ఉన్నత అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఈసారి ఫేస్ రికగ్నిజేషన్ ద్వారా అటెండెన్స్‌ను తీసుకున్నారు. అనారోగ్య కారణాలు, ఇతర కారణాల వల్ల రెండు మూడు రోజుల సడలింపు ఇచ్చారు. ఇదే అదనుగా కోర్సు డైరెక్టర్లు తమ చేతివాటాన్ని ప్రదర్శించారని ఆరోపణలు ఉన్నాయి. నిజంగా అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి సడలింపు ఇస్తే ఓకే కానీ అదే పేరుతో డబ్బులు వసూలు చేస్తూ కొంత మందికి అనారోగ్య సమస్యలు లేకున్నా వంద శాతం అటెండెన్స్ ఇచ్చారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కోర్సు డైరెక్టర్ల విషయంలోనూ సీనియర్, జూనియర్ అంటూ మొదటి నుంచి వివాదాస్పదంగానే కోర్సు నడుస్తుంది. అన్ని వసతులున్న ఇతర పాఠశాలలను కాదని అరకొర వసతులు ఉన్న కోటగల్లి పాఠశాలల్లోనే టీటీసీ కోర్సు పెట్టడం వెనక మర్మం వేరే ఉందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోర్సు డైరెక్టర్ వసతుల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నా విద్యాశాఖ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేపు ఉద్యోగమేళా

నిజామాబాద్ అర్బన్, జూన్ 10: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 12న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు వరుణ్ మోటార్స్, ఎంజీఎం మోటార్స్ నిర్వహిస్తున్నాయని ఈడీపీ ఎగ్జిక్యూటీవ్, టెలీకాలర్స్, రిలేషన్‌షిప్ మేనేజర్, డెలవరీ ఇంచార్జి, డ్రైవర్స్, సేల్స్ ఎగ్జిక్యూటీవ్ ఉద్యోగాలు ఉన్నాయని ఎస్సెస్సీ, ఐటిఐ ఎలక్ట్రిషియన్, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలు ఉన్నవారు జాబ్ మేళాకు హాజరుకావాలన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు శివాజీనగర్‌లోని ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30ల నుంచి మధ్యాహ్నం 3.30లోపు హాజరుకావాలని ఇతర వివరాలకు 9581768413, 9948748428 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.



నామినేటెడ్ పదవులపై నేతల దృష్టి

- మార్కెట్ కమిటీలు, నుడా, గ్రంథాలయ సంస్థల పోస్టుల కోసం ప్రయత్నాలు
- ఎమ్మెల్యేల ద్వారా నేతల సిఫారసు
- నిజామాబాద్ మార్కెట్ కమిటీ నియామకం కోసం కమిషనర్ పరిశీలన
- 'నుడా' చైర్మన్ కోసం కాంగ్రెస్ నేతల పోటాపోటీ
- జడ్పీ, నగర మేయర్‌పై నజర్ పెట్టిన మరికొంత మంది జిల్లా నేతలు

నిజామాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో అధికార కాంగ్రెస్ నేతలు నామినేటెడ్ పోస్టులపై దృష్టి పెట్టారు. ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ నేతల ద్వారా ప్రయత్నాలను చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకమండలి, నుడా, గ్రంథాలయంతో పాటు ఇతర పదవుల కోసం సిఫారసు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేల ద్వారా సీఎంను కలుస్తూ తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ వ్యవహారం కొలిక్కిరాగా 'నుడా' కోసం ఎక్కువ మంది నేతలు పట్టుపడుతున్నారు. తమకు దగ్గరగా ఉన్న నేతల ద్వారా నామినేటెడ్ పదవుల కోసం గట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఎన్నికలు ముగియడం రాష్ట్రం స్థాయిలో నామినేటెడ్ పోస్టులతో పాటు కొన్ని జిల్లాల్లో మార్కెట్ కమిటీలను నియామకం చేయడంతో ఎక్కువ మంది ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే కోడ్ రానుండటంతో ముందస్తుగా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ఐదు పదవులు

జిల్లాకు ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ఐదు పదవులు దక్కడంతో ఈ దఫా జిల్లా పోస్టులపై ఎక్కువగా నజర్ పెట్టారు. మార్కెట్ కమిటీల చైర్మన్‌లతో పాటు నుడా, జిల్లా గ్రంథాలయ సంస్థ పోస్టుల కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. జిల్లాలో మొత్తం ఏడు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, వర్ని, కమ్మర్‌పల్లి, కోటగిరి, వేల్పూర్ మార్కెట్ కమిటీలు ఉండగా వీటికి పాలకవర్గాలు లేవు. గత ప్రభుత్వం నియమించిన కొన్ని మార్కెట్ కమిటీల పాలకవర్గాలు కూడా రద్దు చేశారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీకి నాలుగేళ్లుగా చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులు లేరు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఆదాయం వచ్చే మార్కెట్‌లో ఈ మార్కెట్ ఉంది. నాలుగేళ్లుగా అధికారుల ఆధ్వర్యంలోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎక్కువ మంది పోటీ పడ్డ రాజకీయ సమీకరణాల వల్ల నియామకం చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీ నేతలు ఈ మార్కెట్ కమిటీపై నజర్ పెట్టారు.

సీఎంకు విన్నవించిన రూరల్ ఎమ్మెల్యే

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను నియమించాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని ఎన్నికల ముందే కలిసి విన్నవించారు. ఎన్నికల కోడ్ ఉండటం వల్ల నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయలేదు. నాలుగు రోజుల క్రితమే మంచిర్యాల, కొమరంభీం, ఆసిఫాబాద్ జిల్లాలోని కొన్ని పోస్టులను భర్తీ చేశారు. అదే రీతిలో నిజామాబాద్ మార్కెట్ కమిటీతో పాటు ఇతర కమిటీల పాలకవర్గాలు నియమించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే సీఎం దృష్టికి నామినేటెడ్ పోస్టుల వ్యవహారాన్ని తీసుకెళ్లడంతో పనిచేసే కార్యకర్తలు, నేతలకు అవకాశం ఇస్తామని సీఎం చెప్పినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ఇచ్చిన వినతిపత్రం ఆధారంగా రూరల్‌కు చెందిన ముప్పగంగారెడ్డితో పాటు ఇతర నేతల పేర్లను నిజామాబాద్ మార్కెట్ కమిటీ కోసం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇవే కాకుండా మిగతా ఆరు మార్కెట్ కమిటీలకు సంబంధించి పోస్టుల వివరాలను తీసుకుంటూ వాటిని కూడా భర్తీ చేసేందుకు సిద్ధమవుతుండటంతో పలు నియోజకవర్గాల కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలు

జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలు ఉండటంతో ఎక్కువ మంది నేతలు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. జిల్లాలోని ఈ నామినేటెడ్ పోస్టులకు కాంగ్రెస్ సీనియర్ నేతలు కూడా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ పోస్టులతో పాటు నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) చైర్మన్ కోసం ఎక్కువ మంది ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్‌లో ఏళ్ల తరబడి పనిచేసిన నేతలు ఈ పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. తమకు దగ్గరగా ఉన్న నేతల ద్వారా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. నుడా పరిధి పెరగడం, సుమారు 76 గ్రామాల వరకు ఉండటం వల్ల ఎక్కువ మంది ఈ పోస్టుపై నజర్ పెట్టారు.

నుడా పోస్టు కోసం పోటాపోటీ

నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న నుడా పోస్టు కోసం ఎక్కువ మంది ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు కేశవేణు, శేఖర్‌గౌడ్, గడుగు గంగాధర్, అంతిరెడ్డి రాజరెడ్డి, రత్నాకర్, భక్తవత్సలం, వెంకటేశ్‌తో పాటు మరికొంత మంది నేతలు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మూడు నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ నుడా పోస్టును ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీ కలిసి నిర్ణయం తీసుకుంటేనే భర్తీ చేసే అవకాశం ఉంది. నుడా చైర్మన్‌తో పాటు డైరెక్టర్ల పోస్టుల కోసం కూడా మరికొంత మంది మాజీ కార్పొరేటర్లు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. నగరానికి చెందిన సీనియర్ నేతలు కొంతమంది వచ్చే మున్సిపల్ ఎన్నికలపై దృష్టిపెట్టి పావులు కదుపుతున్నారు. రిజర్వేషన్ల ఆధారంగా మేయర్ పీఠాన్ని చేజిక్కించుకునేందుకు పార్టీకి చెందిన కీలకమైన నేత ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం వచ్చే నెలతో ముగియనుండడంతో జడ్పీ పీఠంపై కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ నేతలు నజర్ పెట్టారు. జడ్పీ చైర్మన్ జనరల్ వస్తే రెడ్డి సామాజిక వర్గం నుంచి పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్రస్థాయిలో కీలకమైన నేతలతో సంబంధాలున్న జిల్లాకు చెందిన ఈనేతలు గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. జిల్లాలో కీలకమైన గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కోసం కూడా ఎక్కువ మంది ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వాహనాల వినియోగం

- 55 వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానిపై చర్యలు తప్పవు : ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

ఖిల్లా, జూన్ 10: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ సింగెనెవార్ ఆదేశాల మేరకు నెంబర్ ప్లేట్ లేని, రిజిస్ట్రేషన్ లేని, త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ లాంటి వాహనాలు సుమారు 55 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో ఆర్‌టీఏ అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో ప్రతిరోజూ వాహనాల తనిఖీ చేపడుతున్నామని తెలిపారు. సోమవారం నాల్గవ టౌన్ పరిధిలోని రుక్మిణి ఛాంబర్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం వాటిని తదుపరి చర్యల నిమిత్తం ఆర్‌టీఏ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమాని సైతం న్యాయస్థానం ఎదుట హాజరుకావాలన్నారు. గతంలో మైనర్ డ్రైవింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడితే జరిమానా వేసి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసి వాహనం ఇచ్చి పంపించేది అన్నారు. కానీ ఇకపై డ్రైవింగ్ చేస్తున్న మైనర్లు వాహనాలను సీజ్ చేసి వారితో పాటు వాహనం ఎవరిపేరున ఉంటుందో వారిని న్యాయస్థానంలో హాజరుపర్చడం జరుగుతుందని తద్వారా న్యాయస్థానం వారికి శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుందని అన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ఈ వాహనాల తనిఖీల్లో నగర ఇన్స్‌పెక్టర్ నరహరి, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వెంకటనారాయణ, 2, 3, 4 పోలీస్ స్టేషన్ల ఎస్సైలు ఎల్.రామ్, ప్రవీణ్, సంజీవ్, ట్రాఫిక్ ఆర్ఎస్సై సుమన్ పాల్గొన్నారు.





వ్యవసాయంలో.. యంత్రాలు

- వ్యవసాయ పనుల్లో పెరిగిన యంత్రాల వినియోగం
- తగ్గుతున్న పెట్టుబడి ఖర్చు
- త్వరగా పూర్తవుతున్న పనులు
- యంత్రాలవైపే మొగ్గుతున్న రైతులు

డొంకేశ్వర్, జూన్ 10: వ్యవసాయ సాగులో యంత్రాల వినియోగం భారీగా పెరుగుతోంది. దుక్కిదున్నింది మొదలు విత్తనం నాటడం పంట చేతికొచ్చే వరకూ యంత్రాల వినియోగం పెరిగింది. గతంలో యాంత్రీకరణ అందుబాటులో లేనప్పుడు ఏ విధమైన వ్యవసాయమైన కూలీలతో చేయించేవారు. ఉపాధిహామీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి పల్లెల్లో కూలీల కొరత, కూలీరేట్లు పెరిగాయి. ప్రస్తుతం రైతులు యంత్రాల ద్వారా పనులు చేపడుతున్నారు. పొలాన్ని నాటుకు సిద్ధం మొదలుకొని పంట చేతికొచ్చి మార్కెట్‌కు తీసుకెళ్లడం వరకూ యంత్రాలనే ఎక్కువ వాడుతున్నారు. జిల్లాలో ప్రతీ పల్లెల్లో పొలం పనులు చేయించుకోవడానికి రైతులు అందుబాటులో ఉన్నా.. ఎక్కువగా యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వాలు సబ్సిడీ ఇవ్వడంతో సామాన్య, మధ్య తరగతి రైతులు ట్రాక్టర్లు ఇతర పనిముట్లను కొనుగోలు చేస్తున్నారు. పంట సాగుతో మొదలుకొని చేతికి వచ్చిన పంటను కోత పూర్తిచేసి మిల్లులకు తరలించే వరకు ఆధునిక పరికరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. తక్కువ పెట్టుబడులు అధిక దిగుబడులే లక్ష్యంగా రైతును సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నారు. దీంతో పాటు చీడపీడల నివారించే విషయంలో కూడా అధికారుల సలహాలు, సూచనలు ఎప్పటి కప్పుడు పాటిస్తున్నారు.

కానరాని కాడెద్దులు..

గతంలో ప్రతీ రైతు ఇంటి వద్ద కాడెద్దులు ఉండేవి. ఎడ్ల బండ్లు దర్శనమిచ్చేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడంలేదు. ట్రాక్టర్ రాకతో కాడెద్దులు కనుమరుగ య్యాయి. గతంలో వ్యవసాయంలో కాడె ఎద్దులు ముఖ్య భూమిక పోషించేవి. గతంలో ఏసంగి, వర్షాకాలం పంటల సాగులో వ్యవసాయ పనులు చేపట్టడానికి ఉదయాన్నే లేచి సద్ది తీసుకొని రైతులు పొలం బాటపట్టేవారు. పొలానికి చేరుకొని నాగలికి ఎద్దులను కట్టి పొలం దున్నేవారు. వరినాటు వేసే సమయంలో ఎడ్లతో భూమిని చదును చేసి పొలం నాటేవారు. కానీ ఇప్పుడు యంత్రాలతో పనులు చేస్తున్నారు. ట్రాక్టర్‌తో దుక్కిదున్నడానికి ప్రస్తుతం ఎకరకు రూ.900 నుంచి రూ.1000చెల్లిస్తున్నారు. భూమి చదును రోటో వేటర్ కోసం రూ.1200నుంచి రూ.1500వరకు రైతులు చెల్లిస్తున్నారు.



పెరిగిన హార్వెస్టర్ల వినియోగం

పంట కోయడానికి కూలీల కొరత రావడంతో హార్వెస్టర్‌లను వినియోగిస్తున్నారు. గతంలో పంటలు ఒకేసారి చేతికి వచ్చిన సమయంలో కూలీల కొరతతో రైతులు ఉక్కిరిబిక్కిరయ్యేవారు. ప్రస్తుతం యంత్రాలు అందుబాటులోకి రావడం కూలీలతో ఐదు నుంచి వారం రోజులు పట్టే పనిని ఒకేరోజు చేసే అవకాశం ఉన్నందున రైతులు యంత్రాల వైపు మొగ్గుచూపుతున్నారు.



యంత్రాల మీదే ఆధారం..
:మల్లారెడ్డి, రైతు, డొంకేశ్వర్



వెనకటి లాగా గ్రామాల్లో పశువులు ఎక్కువగా లేవు. ఇప్పుడు వ్యవసాయం అంతా యంత్రాల మీదే ఆధారపడి ఉంది. ఏ చిన్న పని చేయాలన్నా ట్రాక్టర్‌లతోనే చేస్తున్నాం. యంత్రాల వినియోగం వల్ల ఖర్చు తక్కువ, సమయం కూడా ఆదా అవుతుంది.

గతంలో వారం పట్టేది..
:చిన్నయ్య, రైతు, నికాల్‌పూర్



యంత్రాల ద్వారా పనులు చేయడంతో ఎంత సులువుగా ఉంది. గతంలో నాటుకు సిద్ధం చేయడానికి దుక్కిదున్నడం భూమి చదును చేయడం కోసం వారం పట్టేది. ట్రాక్టర్లు ఉపయోగించడం వల్ల ఒక్క రోజులో ఎకరానికి పైగా నాటు వేయడానికి అవకాశం ఉంది.



తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటినిల్వ సామర్థ్యం

- ప్రాజెక్టులో తగ్గిపోతున్న నీటి నిలువలు
- ఇసుక, మట్టి చేరడంతో తగ్గిన 31.5 టీఎంసీలు
- అధికారికంగా ఎస్సారెస్పీ నీటి నిలువ సామర్థ్యం 80.5 టీఎంసీలేనని ప్రకటన

నిజామాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయింది. ఈ మేరకు ఇంజనీరింగ్ అధికారులు నిర్ధారించారు. సర్వే రిపోర్టు ఆధారంగా నీటి నిలువ సామర్థ్యాన్ని ప్రకటించారు. గడిచిన నలభై ఏళ్లలో 32 టీఎంసీల నీటి నిలు వ సామర్థ్యం తగ్గిపోయిందని ప్రకటించారు. అధికారికంగా ఇంజనీరింగ్ చీఫ్ ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రస్తుత సామర్థ్యాన్ని నిర్ధారిస్తున్నారు. ప్రాజెక్టులో ఇక 80 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యమే ఉందని ప్రకటించారు.

1963లో ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని 1963లో చేపట్టారు. ప్రాజెక్టును 1983లో నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి కాకతీయ, సరస్వతి, లక్ష్మి, గుత్ప అలీసాగర్ ఎత్తిపోతలతో పాటు ఇతర ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టుకు సాగునీటిని అందిస్తున్నారు. నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాలకు తాగునీటిని కూడా ఇస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి 1983లో ప్రజలకు అంకితం చేయగా 1994లో ఇంజనీరింగ్ అధికారులు సర్వే చేపట్టి పూర్తిస్థాయి నీటి సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రాజెక్టు పూర్తయిన పదేళ్లలోనే 21 టీఎంసీల వరకు మట్టి పేరుకుపోయిందని నిర్ధారించారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని 91 టీఎంసీలుగా ప్రకటించారు. ఆ తర్వాత 2014లో ఒకదఫా ఇంజనీరింగ్ అధికారులు సర్వే చేశారు. గత సంవత్సరం అప్పటి ప్రభుత్వం మద్రాస్‌కు చెందిన సెకాన్ కంపెనీకి అప్పచెప్పింది. ఆ కంపెనీ అధికారులు గత సంవత్సరం వానాకాలంలో ప్రాజెక్టు నిండుగా ఉన్నప్పుడు సర్వే నిర్వహించి నివేదికను రాష్ట్ర ఇంజనీరింగ్ అధికారులకు అందించారు. ప్రాజెక్టులో ఇసుక, మట్టి ఎక్కువగా చేరడం వల్ల నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయిందని నిర్ధారించారు. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలే నీటి నిలువ ఉన్నట్లు గుర్తించారు. ఆ నివేదిక ప్రభుత్వానికి ఇవ్వడంతో ఈ జూన్‌లోనే రాష్ట్ర ఇంజనీరింగ్ అధికారులు నిర్ణ యం తీసుకున్నారు. సాగునీటి శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ నిర్ణయం తీసుకొని అధికారికంగా ప్రకటించారు. ప్రాజె క్టులో ప్రస్తుతం 80.5 టీఎంసీల నీటినిలువ సామ ర్థ్యం ఉందని తెలిపారు. అప్పటి నుంచి ఎస్సారెస్పీ అధికారులు అధికారికంగా 80.5 టీఎంసీలు అని ప్రకటించారు. ప్రాజెక్టు కట్టిన ఈ నలభై ఏళ్ల లో సుమారు 31.5 టీఎంసీల మేర మట్టి నిల్వలు పూడుకుపోవడం వల్ల నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయింది. ఆ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఈ నిలువ సామర్థ్యాన్ని ప్రకటించామని ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌రావు గుప్త, ఈఈ చక్రపాణి, ఏఈ వంశీలు తెలిపారు. ప్రాజెక్టులో ఉన్న పరిస్థితులను బట్టి ప్రస్తుతం 80.5 టీఎంసీలే నీటి నిలువ సామర్థ్యం ఉందని వారు తెలిపారు.

'పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి'



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్ద కొడప్‌గల్, జూన్ 10:జుక్కల్ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో కార్మికులుగా పనిచేస్తున్న వారికి గత 8 నెలలుగా వేతనాలు అందడం లేదని, దీంతో కార్మికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కార్మికులకు 8 నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబపోషణ మరింతకష్టంగా మారిందని తెలిపారు. 51వ జీవో సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దుచేయాలని, కార్మికులకు ఇన్సూరెన్స్ చేసి పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటుగానే కారోబార్, బిల్ కలెక్టర్ల ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని, జీవో 60 ప్రకారం పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశా రు. దీంతో పాటుగానే కార్మికులకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ విధానానికి సంబంధించిన విధివిధానాలు అమలుచేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్ర మంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మండల అధ్యక్షులు గోవింద్, కార్మికులు ఈరయ్య, గంగారాం, సాయిలు, మారుతి పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ

ముప్కాల్, జూన్10:బాల్కొండ సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం స్కూల్ యూనిఫామ్‌లను బాల్కొండ ఎంఈవో బట్టు రాజేశ్వర్ ఉపాధ్యాయులకు అందజేశారు. ఒక్కో యూనిఫామ్‌కు రూ.70 చొప్పున సమాఖ్య సంఘాల ద్వారా విద్యార్థుల యూనిఫామ్‌లను కుట్టించి అందజేస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈవో విజయభాస్కర్‌రెడ్డి, సమాఖ్య ఏపీఎం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన అర్బన్ ఎమ్మెల్యే


శుభాకాంక్షలు తెలుపుతున్న అర్బన్ ఎమ్మెల్యే

పెద్దబజార్, జూన్ 10: ప్రమాణ స్వీకారం చేసిన కేంద్ర మంత్రులను సోమవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సామాన్య కార్యకర్తల నుంచి అంచెలంచెలుగా ఎదిగి కేంద్ర క్యాబినెట్‌లో మంత్రులుగా ప్రమా ణ స్వీకారం చేసిన గంగాపురం కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్‌లను తెలంగాణ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల తరపున హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ముప్కాల్, జూన్10: వానాకాలంలో సీజన్‌లో రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠినచర్యలు తప్పవని బాల్కొండ వ్యసాయ విస్తీర్ణ అధికారిణి రేష్మ అన్నారు. సోమవారం బాల్కొండ మండల పరిధిలో నాగాపూర్ గ్రామంలో ఖరీఫ్ సాగుకు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాలలో లూజ్‌విత్తనాలు అమ్మితే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నెలలో సరైన తేమ ఉన్నప్పుడు విత్తుకుంటేనే మొలక శాతం అందుతుందని తెలిపారు. బరువైన నెలలో 70 మిల్లీమీటర్ తేలికపాటి నేలలో 60శాతం వర్షం పడితేనే విత్తనాలు విత్తుకోవాలని రైతులకు వివరించారు. లైసెన్స్ కలిగిన డీలర్‌షాప్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, రశీదు తప్పనిసరి తీసుకొని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని అన్నారు.

రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి

వ్యవసాయాధికారుల సూచన

మద్నూర్, జూన్ 10: వానాకాలం సీజన్ ప్రారంభమైందని, రైతులు మేలురకంతో అధిక దిగుబడులు సాధించాలని, నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. పంటల సాగులో మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవడం ఎంతో ప్రధానం, కాని తరచూ నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతూనే ఉన్నారు. పలు ప్రయివేట్ విత్తన కంపెనీలు ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో నకిలీ లేబుల్‌తో రైతులను మోసం చేస్తున్నాయి. ఇటువంటి విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి దిగుబడి సాధించాలని మండల వ్యవసాయ అధికారి రాజు సూచించారు.

● **విత్తనోత్పత్తి....**

మేలు రకం విత్తనాలను రైతులు కూడా ఉత్పత్తి చేసుకోవచ్చు. మంచి విత్తనం అంటే శుభ్రత, నాణ్యతతో పాటు బాగా మొలకెత్తే స్వభావం ఉండాలి. ప్రతి రైతు తనకు తానే నాణ్యమైన విత్తనాలను తయారు చేసుకుంటే తక్కువ ఖర్చు తో ఎక్కువ దిగుబడి పొందవచ్చు. పరిశోధన సంస్థల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో రూపొం దించే బ్రీడర్ విత్తనం నుంచి ఫౌండేషన్ విత్తనాన్ని ఉత్పత్తి చేస్తారు. ఫౌండేషన్ విత్తనాల నుంచి సర్టిఫైడ్ విత్తనాలు ఉత్పత్తి అవుతాయి. రైతులు ఈ విత్తనాలనే వాడాల్సి ఉంటుంది. సర్టిఫైడ్ సీడ్స్ జన్యుపరంగా మంచి లక్షణాలుంటాయి. మొలకశాతం ఎక్కు వగా ఉంటుంది. రోగకారకమైన శిలీం ద్రాల బెడద ఉండదు. అలాంటి విత్తనా లతో పం డించిన పంటల నుంచి విత్తన ఉత్పత్తి చేసుకుని పంటలు సాగుచేస్తే అధిక దిగు బడులు సాధించవచ్చు.


దుక్కులు చేస్తున్న రైతన్న

● **రైతు కల్తీ కనిపెట్టకుంటే అంతే మరి..**

రైతులు ధర తక్కువగా ఉండే పురుగు మందులు, రసాయన ఎరువులు ఎక్కువ ధర ఉండే కంపెనీల పేరుతో వ్యాపారులు విక్రయిస్తుంటారు. చలామణిలో ఉన్న ఎరువులు, మందులను పోలి ఉండే నకిలీలను విక్రయిస్తూ ఉంటారు. తేమ ఉన్న గడ్డ కట్టిన వాటిలో నాణ్యత ప్రమాణాలు లోపిస్తాయి. గుళికలన్నీ ఒకే రంగులో ఉంటాయి. అన్య పదార్థం ఎరువులో కనిపిస్తే దాన్ని కల్తీగా గుర్తించాలి. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే రైతు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయగలుగుతారు.

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోండి

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి
- అధికారులు, మిల్లర్లతో సమీక్షా సమావేశం
- పాల్గొన్న కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

కామారెడ్డిటౌన్, జూన్ 10: వర్షాకాలం సాగుకు రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కామారెడ్డి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు పూర్తి, 2024-25 ఖరీఫ్‌సీజన్‌కు ముందస్తుగా చేపట్టవలసిన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్, అధికారులు, మిల్లర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్‌మిల్లుల వద్ద వివిధ కారణాలతో తరుగు తీస్తున్నారని, ఇది కరెక్ట్ కాదని అధికారులు, మిల్లర్లు ఒక్క పద్దతి ప్రకారం వెళ్లాలని హెచ్చరించారు. అధికారులు, టాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు , మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. తరుగు సమస్య వచ్చే సీజన్లకు పునరావృతం కావద్దన్నారు. రైతుల పట్ల మానవతా దృక్పథంలో వ్యవహరించాలని, ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్లు, డ్రైయింగ్ మిషన్లు, జాలీ మిషన్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు వర్షకాలం సాగులో భాగంగా సకాలంలో నాట్లు వేసుకునేలా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నకిలీ విత్తనాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ, కాలం చెల్లిన విత్తనాలను విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో జిల్లాలో 350కేంద్రాలను ఏర్పాటు చేసి 3,27,631మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో 85 కేంద్రాల ద్వారా 93వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అకాల వర్షాల కారణంగా పాత సీజన్లకు సంబంధించి ధాన్యం పేరుకుపోయి అన్‌లోడ్ చేయడానికి స్థలం లేక కాస్త ఇబ్బందులు పడ్డ మిల్లర్లు ఓపెన్ స్థలాల్లో ధాన్యాన్ని దించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లిఖార్జున్ బాబు, జిల్లా మేనేజర్ నిత్యానందం, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, ఎఫ్‌సీఐ డివిజినల్ మేనేజర్ ప్రకాష్, డీపీవో భాగ్యలక్ష్మీ, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, మిల్లర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచుకోని అలుగు


ధ్వంసమైన కొండాపూర్ ఊర చెరువు అలుగు

సిరికొండ, జూన్ 10: వర్షాకాలం సమీపించినా ధ్వంసమైన అలుగును మరమ్మతు చేయించడంలో నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సిరికొండ మండలం కొండాపూర్ గ్రామ సమీపాన గల ఊర చెరువు మరమ్మతుకు 2015లో టీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం మొదటి విడతలో రూ.46 లక్షల నిధులు మంజూరు చేసింది. చెరువు కట్ట బలోపేతం చేయడంతో పాటు తూములు, అలుగును మరమ్మతు చేశారు. పూడిక తీత పనులు కూడా చేశారు. అదే ఏడాది కురిసిన భారీ వర్షాలకు చెరువులోకి వరద నీళ్లు అధికంగా రావడంతో అలుగు ఒప్పొంగి ప్రవహించింది. వరద ప్రవాహానికి అలుగు సిమెంటు గోడ కింద మట్టికొట్టుకపోయి అలుగు ధ్వంసమైంది. అప్పటి నుంచి ప్రతి ఏడాది వరద ప్రవాహానికి సిమెంటుతో చేసిన గోడలు నీటిలో కలిసిపోతున్నా నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడమే మానివేశారు. ఇలాగే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రానురాను సిమెంటు గోడల కింద గల మట్టి పోయి చెరువుకు ప్రమాదం ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు. వరద ప్రవాహానికి కాలువ వెడల్పుగా మారి చెరువు కట్టపైకి వెళ్లే దారి లేకుండా పోతుందని రైతులు చెబుతున్నారు. చెరువుకు ప్రమాదం ముంచక ముందే అధికారులు తేరుకుని అలుగు మరమ్మతు పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం

● **ఏఈ సాయినాథ్**

ఊరచెరువు అలుగు మరమ్మతు కోసం రూ.30లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి ఏడాదిన్నర క్రితమే పంపించామని నీటిపారుదల శాఖ ఏఈ సాయినాథ్ చెప్పారు. దెబ్బతిన్న అలుగును ఎస్.ఈ, ఈఈలు కూడా వచ్చి పరిశీలించారని ఆయన చెప్పారు. ఆమోదం రాగానే మరమ్మతు పనులు చేపడుతామని ఏఈ చెప్పారు.

కొనసాగిన ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ అర్బన్, జూన్ 10: పదోన్నతులు, పండిత పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్ కొరకు సీనియారిటీ జాబితాకు అనుగుణంగా సోమవారం లాంగ్వేజ్ పండిత్ తెలుగు, హిందీ, ఉర్దూ, పీఈటీ ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన సాగింది. విద్యాశాఖ కార్యాలయానికి రావడంతో కార్యాలయం ఉపాధ్యాయులతో కిటకిటలాడింది. విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో గతంలో నిలిచిపోయిన పండిత్, పీఈటీల అప్‌గ్రేడేషన్‌తో పాటు ఎస్‌జీటీల పదోన్నతులను కూడా నిర్వహిస్తుంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితాను పొందుపర్చిన అధికారులు ఉపాధ్యాయుల సీనియారిటీ సీరియల్ నెంబర్ ప్రకారం సోమవారం కొంత మంది ధ్రువీకరణ పత్రాలను పరిశీలించగా మంగళవారం మరి కొంత మంది లాంగ్వేజ్ పండిత్‌ల ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ తెలిపారు.

పోలీసు శాఖలో బదిలీలకు రంగం సిద్ధం!

ఖిల్లా, జూన్ 10:పోలీస్ శాఖలో ఎస్సై, సీఐల బదిలీలకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల క్రమంలో మల్టీజోన్‌లో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న సీఐలు, ఎస్సైలు, ఎన్నికల నిబంధనల్లో భాగంగా జిల్లాకు బదిలీపై వచ్చిన సిబ్బంది ఎన్నికలు ముగియడంతో తాము వచ్చిన ప్రాంతాలకు తిరిగి బదిలీపై వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మరికొందరు రెండేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్న వారు సైతం బదిలీపై వెళ్లిపోవాలని తమకు తెలిసిన ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్నట్లు తెలిసింది. ఈనెల 4వ తేదీ నుంచి పోలీస్ శాఖలో జోరుగా ప్రచారాలు జరుగుతున్నట్లు సమాచారం. ఇది పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

సానిటేషన్ పనులను పరిశీలించిన చైర్‌పర్సన్


సానిటేషన్ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఆర్మూర్‌టౌన్ , జూన్10: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, మామిడిపల్లిలో సానిటేషన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ పరిశీలించారు. సానిటేషన్ స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా పెర్కిట్‌లోని 20వార్డు, మామిడిపల్లిలో 24వార్డులో పనులను ఆమె పరిశీలించి డ్రైనేజీలలో ఎలాంటి చెత్తాచెదరం లేకుండా చూడాలని మున్సిపల్ కార్మికులకు తెలిపారు. రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా, నీరు నిల్వకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆమె వివరించారు. ఆమె వెంట వైస్‌చైర్మన్ షేక్ మున్న, కౌన్సిలర్ ఆకుల రాము, మున్సిపల్ కమిషనర్ రాజు, సానిటరి ఇన్‌స్పెక్టర్ మహేష్, మున్సిపల్ అధికారులున్నారు.

మానవతాసదన్ చిన్నారులకు పుస్తకాల పంపిణీ


మానవతా సదన్ చిన్నారులతో అలుక కిషన్

డిచ్‌పల్లి,జూన్ 10: మానవత సదన్ చిన్నారులకు టీఎన్‌జీవో అధ్యక్షుడు కిషన్ ఉచితంగా పుస్తకాలు, పరీక్ష ప్యాడులు పంపిణీ చేశారు. మానవతాసదన్ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థానాల్లో రాణించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార చట్టం వజ్రాయుధం


బోధన్‌లో సమాచారం చట్టం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దృశ్యం

పెద్దబజార్, జూన్ 10: చట్టం పేదవాడికి వజ్రాయుధం లాంటిదని సమాచార హక్కు చట్టం, పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ సలీమ్ అన్నారు. సోమవారం నగరంలోని సమాచార హక్కు చట్టం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చాలా వరకు ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005 బోర్డులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లో సంబంధిత శాఖ వారిచే సమాచారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు ఆదె ప్రవీణ్ మాట్లాడుతూ సెక్షన్ 6 (1) ప్రకారంగా ప్రతి భారత పౌరుడికి కావాల్సిన సమాచారాన్ని సంబంధిత అధికారులచే ఉచితంగా పొందవచ్చని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల శేఖర్ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: సమాచార హక్కు చట్టంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సమాచార హక్కు చట్టం రాష్ట్ర డైరెక్టర్, మాజీ న్యాయమూర్తి ఎంఎ సలీం అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 అక్టోబర్ 12న ఈ మహత్తరమైన చట్టం వచ్చిందని ప్రజలకు ఈ చట్టంపై తప్పకుండా అవగాహన కలిగిఉండాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేసి ప్రజలు కోరిన సమాచారాన్ని అందించాలన్నారు. అధికారులు ప్రజలు అడిగిన సమాచారాన్ని ఇవ్వనట్లయితే రాష్ట్ర కమిషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సమాచార హక్కు చట్టం గురించి అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్ అధ్యక్షులు మహమ్మద్ ఫర్వేజ్ ఖదీర్, కార్యదర్శి సయ్యద్ మౌలానా, ఉపాధ్యక్షులు మహమ్మద్ షరీఫ్, ప్రతినిధులు ఎండీ.నయాఉద్దీన్, నర్సింలు, రాజు, శ్రీనివాస్, మహ్మద్, వాజీద్, ఎండీ అక్తర్, షేక్.జావీద్, ఎండీ అహ్మద్, మొసిన్, అహ్మద్ అయుబ్, తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలిని మార్చడంలో భాగస్వాములు కావాలి

ఉద్యోగులకు డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ సూచన


పత్రాలు అందజేస్తున్న అధికారి

పెద్దబజార్, జూన్ 10: ప్రజల జీవనశైలిని మార్చడంలో భాగస్వాములు కావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లలో ఖాళీలను ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా నియామకం చేయడంలో భాగంగా డీఎంహెచ్‌వోకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఎంఎల్‌హెచ్‌పీలు 46 మంది అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. ఇటీవల ఎన్నికల కోడ్ కారణంగా నియామకాల పత్రాలు అందజేయడంలో ఆలస్యమైనందున ఎన్నికల కోడ్ ముగిసినందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం అర్హులందరికీ నియామకపత్రం అందజేశామని తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కీలకంగా వ్యవహరిస్తూ గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించాలని అన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెంపొందించాలని తెలిపారు. ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏవో చందర్, డాక్టర్ వెంకటేశ్, సూపరింటెండెంట్ వినయ్ కుమార్, డీహెచ్‌ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ ఫారాన, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

వర్ని,జూన్10:వర్ని మండల కేంద్రంలోని సీసీడీ ఆవరణలో సోమవారం 300మంది నిరుపేదలకు ఉచితంగా నిత్యవసర సరుకులను అందజేశారు. మాదాల చారిటబుల్ ట్రస్టు వారి సహకారంతో పప్పులు, చక్కెర, సబ్బులు, చాయ్‌పత్తి వంటి సరుకులను అందజేశారు. ఒక్కొక్కరికి రూ.500 విలువ గల సరుకులను అందజేసినట్లు సీసీడీ మేనేజర్ ఠాగూర్ తెలిపారు. సరుకుల పంపిణీ పట్ల పేదలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పీవీ సుబ్బారావు, భారత్ గ్యాస్ నర్సయ్య పాల్గొన్నారు.

'అధిక ఫీజులు అరికట్టాలి'

వర్ని,జూన్10: వర్ని ఉమ్మడి మండలంలో గల ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని ఏబీవీపీ వర్ని మండల శాఖ డిమాండ్ చేసింది. సోమవారం వర్ని విద్యా వనరుల కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. చదువు బోధించాల్సిన విద్యా సంస్థలు నిబంధనలు తుంగలో తొక్కి యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, స్కూల్ ఫీజుల పేరిట దోపిడికి పాల్పడుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నియంత్రించకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంజయ్, మహేష్, విష్ణుతేజ పాల్గొన్నారు.

వేతనాలు అమలు చేయాలి

వర్ని,జూన్10: మే 1నుంచి అమలులోకి వచ్చిన బీడీ కార్మికుల వేతనాలను వెంటనే అమలు చేయాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం చందూర్ మండల కేంద్రంలో సాబ్లె వాహూరే బీడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్యాకర్స్, నౌకర్ స్టాఫ్, కమీషన్‌దారులకు పెరిగిన ఒప్పందాలను తెలియపరిచే కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఖిల్లా, జూన్ 10:రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన 4వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వినాయక్‌నగర్‌కు చెందిన ఆరెపల్లి గౌతం (42) ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని కిందపడ్డాడు. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న నాల్గవటౌన్ పోలీసులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

ఖిల్లా, జూన్ 10: కదులుతున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం సాయంత్రం సిర్నాపల్లి - ఉప్పల్‌వాయి రైల్వేస్టేషన్ మధ్యలో చోటుచేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయరెడ్డి తెలిపారు. రైల్వేస్టేషన్ మాస్టర్ సమాచారం మేరకు అటవీ ప్రాంతంలో ఉన్న రైలు ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు తెలిపారు. మృతుడుకి సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని అతని కుడిచేయి పైన కవిత అని పచ్చబొట్టు రాసి ఉందని తెలిపారు. మృతదేహాన్ని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712658591 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య...

మోర్తాడ్: గ్రామానికి చెందిన పాల్దా సంతోష్ (20) గూడ్స్ ట్రైన్‌కు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. ఆత్మహత్యకు వ్యక్తిగత కారణాలు ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎడపల్లిలో వ్యక్తి అదృశ్యం

ఎడపల్లి, జూన్ 10: ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన పల్లికొండ సాయిలు అదృశ్యం అయినట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పల్లికొండ సాయిలు ఆదివారం ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, కుటుంబసభ్యులు తెలిసిన వారిని, బంధువులను అడిగినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం సాయిలు భార్య కల్పన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కమ్మర్‌పల్లి మండలానికి 18వేల983పాఠ్యపుస్తకాలు

కమ్మర్‌పల్లి, జూన్10:కమ్మర్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు 2024-25 విద్యసంవత్సరానికి సంబంధించిన 1నుంచి 10వ తరగతి విద్యార్థులకు 18వేల 983 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు. అదే విధంగా 5నుంచి 10వ తరగతి విద్యార్థులకు 12వేల 668 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ యాజమాన్యం

నిజామాబాద్ అర్బన్, జూన్ 10: ఐఐటి జేఈఈ అడ్వాన్స్‌డ్ జాతీయ పరీక్ష ఫలితాలలో నగరానికి చెందిన నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన జి.అన్వేష్ 1140వ ర్యాంక్, మద్రి హర్ష 1220వ ర్యాంక్‌ను సాధించారు. అన్వేష్ ఇంటర్‌లోనూ 961 మార్కులు సాధించాడని ఐఐటి ముంబాయ్‌లో కంప్యూటర్ ఇంజనీర్‌గా చేరి భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించడమే లక్ష్యంగా పేర్కొన్నాడు. తనకు ఈ ర్యాంక్ వచ్చేందుకు తోడ్పడిన నారాయణ కళాశాల అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు. మద్రి హర్ష మాట్లాడుతూ ఇంటర్‌లో తనకు 987 మార్కులతో పాటు ఎప్‌సెట్‌లో 1579, జెఈఈ మెయిన్స్‌లో 848వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఎన్-120 ప్రోగ్రాంలో భాగంగా రెండుగంటల బోధన, 9 నెలల రివిజన్ ప్రోగ్రాం, పార్ట్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు, వీక్లీ అసైన్‌మెంట్‌ల ద్వారా తాను ఈ మార్కులు పొందానని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి, ఏవో శేఖర్, కోర్‌డీన్ వీరాంజనేయ ప్రసాద్ తదితరులు అభినందించారు.

సిద్ధుల గుట్టపై సిద్ధేశ్వరుడికి అభిషేకం



సిద్ధులగుట్టపై పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

పెర్కిట్, జూన్10: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శివాలయంలో భక్తులు సిద్ధేశ్వరునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. చుట్టు పక్కల నాలుగు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి సిద్ధేశ్వరునికి దర్శించుకున్నారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకీసేవలో ఆర్మూర్ భజన మండలి సేవలో పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. సిద్ధులగుట్టపై విచ్చేసిన భక్తులకు గుద్దెటి మహేశ్వర్ గాయత్రి కుటుంబసభ్యులు, ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.ఈకార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు బి.సుమన్, ఎస్సై అశోక్, వీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, హజారీ సతీష్, ఆనంద్, ప్రశాంత్‌గౌడ్, సిద్ధులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను తప్పనిసరిగా బడిలో చేర్పించాలి



మదన్‌పల్లిలో బడిబాటలో పాల్గొన్న జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్, జూన్ 10: ప్రభుత్వం విద్యార్థులకు మంచి విద్యబోధనను కల్పిస్తుందని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందాలను కావున తల్లిదండ్రు లు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. సోమవారం మాక్లూర్ మండలం లోని ముత్యంపల్లి, మదన్‌పల్లి గ్రామాలలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అలాగే ముత్యంపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లా డుతూ వంద రోజుల్లో పని దినాలను ఉపయోగించుకోవాలని అన్నారు. ఎంపీడీవో క్రాంతి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, కార్పొరేటర్ రాజసింగ్, ఎంపీటీసీ ఒడ్డెన్న, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందు తుందని తొర్లికొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగం అశోక్ అన్నారు. బడిబాట కార్యక్రమలో భాగంగా సోమవారం మండలం లోని తొర్లికొండ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందు తున్న నాణ్యమైన విద్య, ఉచితంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలను ప్రభుత్వ పాఠశాలలో విద్యా ర్థులకు అందుతాయని తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ నగేష్, ఉపాధ్యాయులు స్వరూపరాణి, వీడీసీసభ్యులు, అంగన్‌వాడి టీచర్‌లు, ఆశవర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: నాణ్యమైన విద్యఅందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధానవీదులగుండా ర్యాలీ నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న వసతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, పాఠశాల హెచ్‌ఎం సురేష్‌కుమార్, వీడీసీ క్యాషియర్ గంగారెడ్డి, చందు మయ్యన్న, జలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: బడి బాట లో భాగంగా సోమవారం మండల నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం అమృతాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. వడ్డెర కాలనీలోని అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలన చేశారు. కేంద్రంలోని 5ఏళ్ల దాటిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పవన్ కుమార్, అంగన్ వాడీ ఉపాధ్యాయులు జ్యోతి,సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ మీడియంలో ఉపాధ్యాయుల కొరత తీర్చండి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

ధర్పల్లి, జూన్ 10: మండల కేంద్రంలోగల ఉర్దూ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కమిటీ నాయకులు, మైనార్టీ పెద్దలు డీఈవోకు వినతిపత్రం అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోగల డీఈవో కార్యాలయంలో ఆయన్ను కలిశారు. పాఠశాలల ప్రారంభంలోపే ఉపాధ్యాయుల కొరత తీరిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. బదిలీలు, పదోన్నతులు కల్పిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పాఠశాలకు ఉపాధ్యాయులను ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు నజీర్, షేక్ హుస్సేన్, అబ్దుల్ మాజీద్, అబ్దుల్ హమీద్, అబ్దుల్ హజీజ్, ఖాజా హైమద్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

డిచ్‌పల్లి, జూన్ 10: నేడు మెంట్రాజ్‌పల్లి రైతు వేదిక లో రైతులకు శాస్త్రవేత్తల సలహాలు, సూచనల కొరకు హైదరాబాద్ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని కావున రైతులు అధిక సంఖ్యలో హాజరై పంటల సాగుపై సలహాలు, సూచనలు, సమస్యలు పరిష్కరించుకొవాలని ఏవో రాంబాబు తెలిపారు. కావున రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

'ప్రజావాణి'కి వినతుల వెల్లువ

● 135 వినతులు ● కలెక్టరేట్‌లో సందడి వాతావరణం

నిజామాబాద్ అర్బన్, జూన్ 10: పార్లమెంట్ ఎన్నికల కోడ్ వల్ల తాత్కాలికంగా వాయిదా పడిన ప్రజావాణి కార్యక్రమం సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించారు. సుమారు మూడు నెలల అనంతరం ప్రజావాణి నిర్వహించడంతో ఫిర్యాదులు వెల్లువలా వచ్చాయి. ప్రజావాణికి మొత్తం 135 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్ తదితరులు వినతులు స్వీకరించారు. కాగా ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను వెంటవెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

● కలెక్టరేట్‌కు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు

ఆర్మూర్ డివిజన్‌లో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఆర్మూర్ మండలం మామిడిపల్లిలోగల సేయింట్ పాల్ స్కూల్‌లో గత ఐదేళ్లుగా సుమారు 180 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని 2022 నుంచి ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు బకాయిలు చెల్లించకపోవడంతో స్కూల్ యాజమాన్యం ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు ఈ స్కీమ్ వర్తించదని స్కూల్ యాజమాన్యం తెలియజేస్తుందని తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను చెల్లించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద లబ్ధిపొందిన విద్యార్థులను అదే స్కూల్‌లో కొనసాగించాలని, స్కూల్ యాజమాన్యం బకాయిల కోసం ప్రభుత్వ అధికారులను సంప్రదించాలే తప్ప విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని వారు కోరారు.



కలెక్టరేట్‌కు వచ్చిన ఆర్మూర్ ప్రాంతానికి చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు

● మహిళా సంఘాలలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

బోధన్ మండలం కల్దుర్కి గ్రామ క్రాంతి మహిళా సంఘంలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘానికి చెందిన ప్రతినిధులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. మహిళా సంఘ సభ్యురాలైన మనీష సంఘంలో సభ్యుల వద్ద డబ్బులు వసూలు చేసి వారి సొంత ఖర్చులకు వాడుకోవడం జరిగిందని సంఘ సభ్యులకు తెలియకుండా నకిలీ ఓచర్లు, స్టాంపులు సంతకాలు చేసి వాడుకోవడం జరిగిందని ఈ విషయమై బోధన్ పోలీస్ స్టేషన్‌లో, గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేశామని కావున తమ సమస్యను పరిష్కరించి డబ్బులను ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. సంఘ సభ్యులు పద్మ, సంగీత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు చైన్‌స్నాచర్ల అరెస్టు

● 15.7 తులాల బంగారం స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ బస్వారెడ్డి

ఆర్మూర్‌టౌన్, జూన్10: గత కొన్ని నెలలుగా వివిధ మండలాల్లో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న నలుగురు చైన్ స్నాచర్‌లను పట్టుకుని 15.7తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్టు ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బస్వారెడ్డి మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా లక్సెటిపేట్ గ్రామానికి చెందిన అబ్దుల్ సాజిద్, పాతూరి తరుణ్, డిచ్‌పల్లి మండలానికి చెందిన బోయే శంకర్, జిల్లా కేంద్రంలోని మిర్చికంపౌడ్‌కు చెందిన పద్మజి చంటిసాయికుమార్‌ను వివిధ ప్రాంతాల్లో నెంబర్ ప్లేట్ లేని స్కూటి, అలాగే పల్సార్ బైక్‌లపై చైన్‌స్నాచింగ్ చేసేవారని, వీరు మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో మోపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిట్టాపూర్ గ్రామంలో, అలాగే లక్ష్మణ్‌చంద పోలీస్‌స్టేషన్ పరిధిలో టిచార గ్రామంలో, గన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలమడుగు గ్రామంలో, ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేగాం గ్రామంలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డారని తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించిన మోర్తాడ్ ఎస్సై అనిల్‌రెడ్డి, పీసీలు సురేష్, నారాయణ, కమ్మర్‌పల్లి పీసీ నవీన్‌చంద్రలను సీపీ కల్మేశ్వర్ అభినందించారని ఆయన తెలిపారు.

పశువుల అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు

● అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్ అర్బన్, జూన్ 10: పశువుల అక్రమ రవాణను నిరోధించేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బక్రీద్ వేడుకలను పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సోమవారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమం, గోవధ నిషేదంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాలు పక్కాగా అమలయ్యేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. గోవధ నిషేధ చట్టం 1977 ప్రకారం గోవధను నిషేధించినందున ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తూ ఎక్కడ కూడా గోవధ జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లాలోని కందకుర్తి, సాటాపూర్, సాలూరా, పోతంగల్, కాండ్‌గావ్, యంచ, పోచంపాడ్, కమ్మర్‌పల్లి, ఇందల్వాయి, తదితర ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉంచేలా చూడాలని నిబంధనలకు విరుద్ధంగా వివిధ వాహనాల్లో పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేయాలన్నారు. సీజ్ చేసిన పశువులను స్థానికంగా షెల్టర్ కల్పిస్తూ వాటికి పశుగ్రాసం, నీటి వసతి ఉండేలా చూడాలన్నారు. వారంతపు సంతల్లో నిబంధనలకు అనుగుణంగా పశుసంరక్షణ చట్టానికి లోబడి క్రయ విక్రయాలు జరిగే చూడాలన్నారు. బక్రీద్ సందర్భంగా ఎక్కడపడితే అక్కడ పశువులను వధించకుండా కట్టడి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు, ఆర్‌డీవోలు రాజేందర్‌కుమార్, రాజాగౌడ్, రాజేశ్వర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జనార్ధనచారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

● నులిపురుగుల నిర్మూలన పోస్టర్ల ఆవిష్కరణ

జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నులిపురుగుల నివారణ పోస్టర్లను సోమవారం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ తదితరులు ఆవిష్కరించారు. నులిపురుగులు అనేది పిల్లల్లో పేగుల నుంచి పోషకాలు గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులను పిల్లలు మట్టిలో ఆడుకోవడం ద్వారా, చేతులు శుభ్రంగా కడుక్కోకపోవడం ద్వారా అవి పిల్లల కడుపుల్లోకి వెళ్లే అవకాశం ఉందని దీనివల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, తదితర సమస్యలు వచ్చే అవకాశం ఉందని వారు అన్నారు.ఈ విషయమై అంగన్‌వాడి కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 20న పిల్లలందరికి ఈ మాత్రలు అందేలా చూడాలన్నారు.

అన్ని దానాలలో కంటే అన్నదానం గొప్పది

నిజామాబాద్ లీగల్, జూన్ 10:అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని న్యాయసేవా సంస్థ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.శ్రీకాంత్‌బాబు అన్నారు. సోమవారం జిల్లా కోర్టులో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. న్యాయ సేవా సంస్థ ద్వారా చేస్తున్న ఈఅన్నదాన కార్యక్రమం వెలకట్టలేనిదని అన్నారు. న్యాయసేవా సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి పద్మావతి మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం వేసవి కాలంలో కక్షిదారులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తంగౌడ్, సిబ్బంది, సీనియర్ సివిల్ న్యాయాధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

బాధిత కుటుంబానికి పరామర్శ

డిచ్‌పల్లి,జూన్ 10:మండలంలోని ధర్మారం(బి)గ్రామంలో సీనియర్ కాం గ్రెస్ నాయకుడు శాకటి మురళి కుమారుడు ప్రేమ్ కుమార్ రెండు రో జుల క్రితం ప్రమాదవశాత్తు మరణించడంతో ఆ కుటుంబాన్ని రూరల్ ఎ మ్మెల్యే డా.భూపతిరెడ్డి పరామర్శించారు. రోధిస్తున్న కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటానని ధైర్యంగా ఉండలన్నారు.

ఏరియర్స్ చెల్లించాలని కమిషనర్‌కు వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆర్మూర్‌టౌన్, జూన్10: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏరియర్స్ చెల్లించాలని సోమవారం మున్సిపల్‌కమిషనర్ రాజుకు వినతి పత్రం అందజేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గత ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 4ప్రకారం 30శాతం వేతనాలు పెరిగాయని, పెరిగిన వేతనాలను కౌన్సిల్‌లో తీర్మానించి ఎనిమిది నెలలుగా రావాల్సిన వేతనాలలో ఒక నెల వేతనం మాత్రం చెల్లించారని, డిసెంబర్ 22నుంచి జూర్ 23తేదీ వరకు రావల్సిన ఏరియర్స్ చెల్లించాలని కమిష నర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ ఐలను కట్టా లని సానిటరి సిబ్బందికి బట్టలు, సబ్బులు అందజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు బాబురావు, మున్సిపల్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

చేపూర్‌లో గుర్తు తెలియని శవం లభ్యం

ఆర్మూర్‌టౌన్ , జూన్10: మండలంలోని చేపూర్ గ్రామశివారులో గుర్తుతెలియని శవం (40) లభ్యమైనట్టు ఎస్సై అశోక్ తెలిపారు. చేపూర్ గ్రామశివారులో ఓ పాడుబడ్డ బావిలో దుర్గంధపు వాసన రావడంతో సోమవారం గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలాన్ని ఎస్సై అశోక్, పోలీస్ సిబ్బందితో పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మృతదేహం కుళ్లిపోవడంతో ప్రభుత్వ డాక్టర్‌లచే పోస్టుమార్టం నిర్వహించి అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.

బడి ప్రారంభానికి ముందే దుస్తులు అందించాలి

● డీఆర్‌డీవో సాయాగౌడ్



నాగేపూర్‌లో ఏకరూప దుస్తులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

నవీపేట,జూన్10: ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభం అయ్యేలోగా ఏకరూప దుస్తులను అందించాలని డీఆర్‌డీవో సాయాగౌడ్ కోరారు. సోమవారం నవీపేట, శివతండా, నాగేపూర్‌లలోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అందిస్తున్న ఏకరూప దుస్తులను ఆయా గ్రామాలల్లోని మహిళ సంఘాల సభ్యులకు కుట్టడానికి అందించడంతో వారికి ఆర్థికంగా తోడ్పాటు అందుతుందని అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులను పాఠశాలలు ప్రారంభించే రోజు నాటికి కుట్టించి అందించాలని సూచించారు. ఈ సందర్భంగా కుట్టించిన పలు దుస్తులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, ఏపీఎం భూమేష్ గౌడ్, నాగేపూర్ మాజీ సర్పంచ్ జ్యోతి, ఐకేపీ సీసీలు సువర్ణ, ప్రవీణ, రాజమణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఏకరూప దుస్తుల పంపిణీ



సాలూరాలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ దృశ్యం

బోధన్‌రూరల్,జూన్10: సాలూర మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం, హరిజన వాడలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు మండల సమాఖ్య-1 ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ఏకరూప దుస్తుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు స్కూల్ యూనిఫామ్‌లు, పుస్తకాలు ఉచితంగా అందజేయబడతాయని ఐకేపీ ఏపీఎం వినోద్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడానికి పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు త్వరితగతిన ఏకరూప దుస్తులను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏపీసీ చైర్మన్‌లు, పాఠశాల హెడ్‌మాస్టర్లు, విద్యార్థులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తుల అందజేత

రెంజల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సోమవారం ఎంపీపీ రజిని కిషోర్ చేతుల మీదుగా ఏకరూప దుస్తులతో పాటు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను అందించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యబోధన నేర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో గణేష్ రావు, ఏపీఎం చిన్నయ్య, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, సాయిరెడ్డి, వీజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీని రెండు రోజుల్లో ముగించండి : డీఎంహెచ్‌వో



తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌వో బృందం

పెద్దబజార్, జూన్ 10:ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీని ఇంకా రెండు రోజుల్లో ముగించాలని సుమారు 60 టీమ్‌ల ద్వారా ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేస్తున్న వారికి డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అనుగుణంగా నియమనిబంధనలకు అనుగుణంగా ఉన్నటువంటి ఆసుపత్రులు ఎన్ని, లేనివి ఎన్ని అదే విధంగా ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు నిర్వహిస్తున్న వాటిలో ఎన్ని నిబంధనలకు అనుగుణంగా ఉన్నవి లేనివి తెలుసుకోవడానికి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నటువంటి ఈ ప్రైవేటు ఆసుపత్రుల సర్వేని ఇంకా రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి జిల్లా వైద్య శాఖ అధికారికి రిపోర్టు చేయాలని టీమ్‌లను కోరారు. సర్వే రిపోర్టును కన్సాలిడేషన్ చేసి డీఎంహెచ్‌వోకు పంపించాల్సిందిగా జిల్లా నుండి రాష్ట్ర అధికారులకు దాని యొక్క రిపోర్టును పంపడం జరుగుతుందన్నారు. నిజామాబాద్ పట్టణంలో ప్రైవేటు ఆసుపత్రులు అధికంగా ఉండటం వల్ల సర్వేను వేగవంతం చేస్తూ మిగిలిన వాటిని పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంతోష్, శ్రీరామ్‌యాదవ్, అలేఖ్య, డి.శ్రీనివాస్, శ్రీధర్, రఘులు ఉన్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.71,800	రూ.66,200	రూ.905

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మనమే (10.20, 10.20)
: ముంజియా (హిందీ) (1.35)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (4.20)
: సత్యభామ (7.25)
స్క్రీన్-2 : బ్యాడ్ బాయ్స్ (10.30, 4.30, 10.30)
: మనమే (1.15, 7.15)
స్క్రీన్-3 : సత్యభామ (11.25, 10.40)
: భజే వాయువేగం (2.20)
: ముంజియా (హిందీ) (5.10, 7.55)
స్క్రీన్-4 : గోల్డ్ నెంబర్-1 (10.30)
: లవ్ మౌళీ (1.20)
: మనమే (4.20)
: రక్షణ (7.40)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (10.45)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మనమే (10.50, 1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-2 : రక్షణ (10.25)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (1.30, 7.30)
: సత్యభామ (4.30)
: భజే వాయువేగం (10.30)
స్క్రీన్-3 : లవ్ మౌళీ (10.40)
: బ్యాడ్ బాయ్స్ (1.45, 7.45)
: రక్షణ (4.30)
: సత్యభామ (10.30)

దేవి : గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : రక్షణ (11.00, 6.00)
: వెపన్ (2.00, 9.00)
విజయ్ : మనమే (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్